

# మనం



## నిజామాబాద్
## కామారెడ్డి

శుక్రవారం । 23 । అక్టోబర్ । 2026 పేజీలు: 10


# ప్రజారోగ్య సేవకుల సమస్యలు పరిష్కరించాలి



ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమ్మెకు ఎంపీ ధర్మపురి అరవింద్ మద్దతు

కరోనా కష్టకాలంలో సేవలందించిన సిబ్బందికి న్యాయం చేయాలి

2

## పాచిన మిఠాయిల విక్రయాలకు

# ముస్తాబవుతున్న స్వీట్ హోంలు!

2

దసరా, దీపావళి వేళ ప్రజారోగ్యంతో చెలగాటమా? తనిఖీలు చేపట్టాలని ప్రజల డిమాండ్

పండుగల సీజన్లో మిఠాయిల అమ్మకాలు జోరు..

నాణ్యతపై నిఘా ఏదీ?

కాలం చెల్లిన స్వీట్లు విక్రయిస్తే ప్రజల ఆరోగ్యానికి ముప్పు

లైసెన్సులు లేని దుకాణాలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి




## ప్రజలకు మెరుగైన సేవలందించడమే

# లక్ష్యంగా పనిచేయాలి



రెవెన్యూ ఉద్యోగులతో ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి

దసరా సందర్భంగా ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 22 (మనం న్యూస్): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ, ప్రభుత్వ సేవలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి సూచించారు.

2

## అమరుల త్యాగం మరువలేం..
## వారి కుటుంబాలకు అండగా ఉంటాం!



3

# వర్షాభావం..
# ప్రత్యామ్నాయ పంటలే మేలు!

- జిల్లాలో 4-5 మీటర్ల మేర తగ్గిన భూగర్భ జలమట్టం, యాసంగిలో ఆరుతడి పంటలకు ప్రాధాన్యమివ్వాలి.
- ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.



3

# పాచిన మిఠాయిల విక్రయాలకు ముస్తబౌ తున్న స్వీట్ హోంలు!

**దసరా, దీపావళి వేళ ప్రజారోగ్యంతో చెలగాటమా? తనిఖీలు చేపట్టాలని ప్రజల డిమాండ్**

**పండుగల సీజన్లో మిఠాయిల అమ్మకాలు జోరు.. నాణ్యతపై నిఘా ఏదీ?**

**కాలం చెల్లిన స్వీట్లు విక్రయిస్తే ప్రజల ఆరోగ్యానికి ముప్పు**

**లైసెన్సులు లేని దుకాణాలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి**

ఆర్మూర్, అక్టోబర్ 22 (మనం న్యూస్): ఆర్మూర్, పండుగల వేళ మిఠాయిల విక్రయాలు జోరందుకుంటుండగా, కొన్ని స్వీట్ హోంలలో పాచిపోయిన, కాలం చెల్లిన మిఠాయిల విక్రయాలు జరిగే ప్రమాదం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దసరా పండుగ సందర్భంగా మిఠాయిల కొనుగోళ్లు పెరగగా, రానున్న దీపావళి పండుగతో అమ్మకాలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో ఆహార పదార్థాల నాణ్యతను అధికారులు ముందుగానే పరిశీలించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.




### గడువు తేదీలపై వినియోగదారుల నిర్లక్ష్యం !

స్వీట్ హోంలకు వెళ్లే చాలామంది వినియోగదారులు మిఠాయిల తయారీ తేదీ, గడువు తేదీ, నిల్వ పరిస్థితులను పరిశీలించకుండానే కొనుగోలు చేస్తున్నారని ఆందోళనలు ఉన్నాయి. మరోవైపు, కొందరు వ్యాపారులు నాణ్యత ప్రమాణాలను పట్టించుకోకుండా విక్రయాలకు పాల్పడితే ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. కలుషితమైన లేదా పాడైపోయిన ఆహార పదార్థాలు తినడం వల్ల వాంతులు, విరేచనాలు, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తవచ్చు. దీంతో బాధితులు ఆసుపత్రులను ఆశ్రయించి వైద్య పరీక్షలు, చికిత్స కోసం వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు.

### ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు ఎక్కడ?

పండుగల సమయంలో ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఫుడ్ సేఫ్టీ అధికారులు, మున్సిపల్ శానిటరీ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. స్వీట్ హోంలలో విక్రయిస్తున్న మిఠాయిల నాణ్యత, తయారీ తేదీలు, గడువు తేదీలు, నిల్వ విధానాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచిస్తున్నారు. పాడైపోయిన,






కాలం చెల్లిన ఆహార పదార్థాలు గుర్తిస్తే నిబంధనల ప్రకారం వాటిని తొలగించి, బాధ్యులైన వ్యాపారులపై జరిమానాలు విధించడంతోపాటు అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### లైసెన్సులు లేకుండానే దుకాణాల నిర్వహణ?

కొన్ని స్వీట్ హోంలు అవసరమైన అనుమతులు, లైసెన్సులు లేకుండానే దుకాణాలు నిర్వహిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై మున్సిపల్ అధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. అనుమతులు, ఆహార




భద్రత నిబంధనల అమలుపై అధికారులు స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనల ఉల్లంఘనలు ఉన్నా చర్యలు తీసుకోకపోతే అధికారుల పర్యవేక్షణపై అనుమానాలు వ్యక్తమయ్యే అవకాశం ఉంది.

### పండుగల వేళైనా అధికారులు మేల్కొనాలి!

ప్రజల ఆరోగ్యంతో వ్యాపారులు చెలగాటమాడకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రజలు కోరుతున్నారు. దీపావళి అమ్మకాలు మరింత పెరిగేలోపే స్వీట్ హోంలలో తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలు కూడా మిఠాయిల కొనుగోలు సమయంలో తయారీ తేదీ, గడువు తేదీ, ప్యాకింగ్ వివరాలు పరిశీలించి, అనుమానాస్పద ఆహార పదార్థాలను కొనుగోలు చేయకుండా అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.ప్రజారోగ్యమే ప్రథమ ప్రాధాన్యంగా భావించి అధికారులు ఇప్పటికైనా స్పందిస్తారా? పండుగల పేరుతో ప్రజలకు నాణ్యతలేని ఆహారం విక్రయించకుండా అడ్డుకట్ట వేస్తారా? అనేది వేచి చూడాలి.

# పజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా పనిచేయాలి

**రెవెన్యూ ఉద్యోగులతో ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి**

**దసరా సందర్భంగా ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు**

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 22 (మనం న్యూస్): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ, ప్రభుత్వ సేవలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి సూచించారు.

దసరా పండుగను పురస్కరించుకుని గురువారం నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల తహసీల్దార్లు (ఎమ్మార్వోలు), రెవెన్యూ ఉద్యోగులు రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉద్యోగులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ పండుగ శుభాకాంక్షలు స్వీకరించారు. అనంతరం నియోజకవర్గ పరిధిలో రెవెన్యూ శాఖ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, ప్రజా సమస్యల పరిష్కారం, రెవెన్యూ పరిపాలనకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.



ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య రెవెన్యూ శాఖ కీలక వారధిగా పనిచేస్తుందని, ప్రజలకు అవసరమైన సేవలను సకాలంలో అందించడంలో ఉద్యోగుల పాత్ర ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి, వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు.

దసరా పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి సౌభాగ్యాలను నింపాలని ఆకాంక్షించారు. ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా చర్చించారు.

ఈ కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు రమన్ రెడ్డి, ఇతర రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.





# ప్రజారోగ్య సేవకుల సమస్యలు పరిష్కరించాలి

**ఎన్హెచ్ఎం ఉద్యోగుల సమ్మెకు ఎంపీ ధర్మపురి అరవింద్ మద్దతు**

**కరోనా కష్టకాలంలో సేవలందించిన సిబ్బందికి న్యాయం చేయాలి**



నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 22 (మనం న్యూస్): జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్హెచ్ఎం) పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ కోరారు. గురువారం ఎన్హెచ్ఎం ఉద్యోగులు నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని సందర్శించిన ఆయన, వారి ఆందోళనకు మద్దతు ప్రకటించారు.

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. దాదాపు రెండు దశాబ్దాలుగా వైద్య ఆరోగ్య రంగంలో సేవలందిస్తున్న ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయాల్సి రావడం విచారకరమన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో నర్సులు, ఆరోగ్య సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.

### కరోనా సమయంలో సేవలు మరువలేనివి

కరోనా మహమ్మారి విజృంభించిన విపత్కర పరిస్థితుల్లోనూ నర్సులు, ఎన్హెచ్ఎం ఉద్యోగులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు వైద్య సేవలందించారని ఎంపీ గుర్తుచేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నిరంతరం శ్రమించిన సిబ్బంది సేవలను ప్రభుత్వం గుర్తించాలని, వారి న్యాయమైన డిమాండ్లపై సానుకూలంగా స్పందించాలని కోరారు.

### ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

దీర్ఘకాలంగా కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ పద్ధతుల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం ప్రాధాన్య క్రమంలో పరిశీలించాలని ధర్మపురి అరవింద్ సూచించారు. ఎన్హెచ్ఎం ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, వారి పోరాటానికి మద్దతుగా నిలుస్తానని భరోసా ఇచ్చారు.

ప్రజలకు వైద్య సేవలందించడంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఆరోగ్య సిబ్బందికి న్యాయం జరిగేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. తమ సమస్యలు పరిష్కారమై, ఉద్యోగ భద్రతతో పాటు న్యాయమైన డిమాండ్లు నెరవేరుతాయని ఎన్హెచ్ఎం ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# వర్షాభావం.. ప్రత్యామ్నాయ పంటలే మేలు!

**- జిల్లాలో 4-5 మీటర్ల మేర తగ్గిన భూగర్భ జలమట్టం, యాసంగిలో ఆరుతడి పంటలకు ప్రాధాన్యమివ్వాలి.**
**- ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.**

కామారెడ్డి, అక్టోబర్ 22 (మనం బ్యూరో)

వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. నీటి లభ్యతను అంచనా వేసుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని, నీటి వనరులను పొదుపుగా వినియోగిస్తూ ప్రతి నీటి బొట్టునూ సంరక్షించాలని కోరారు. సదాశివనగర్ మండలం ధర్మారావుపేట రైతువేదికలో గురువారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిర్వహించిన




వీడియో సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలు, పత్తి మార్కెటింగ్, కనీస మద్దతు ధరలపై రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. అనంతరం రైతునేస్తం, ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా రైతులతో కలెక్టర్ మాట్లాడారు.




**నీటి లభ్యతను బట్టి సాగు ప్రణాళికలు.**

జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే భూగర్భ జలమట్టం సుమారు నాలుగు నుంచి ఐదు మీటర్ల మేర తగ్గిందని తెలిపారు. సదాశివనగర్, పెద్దకొడప్గల్, మహమ్మద్నగర్ మండలాల్లో వర్షపాతం లోటు ఉందన్నారు. రాబోయే ఎనిమిది నుంచి తొమ్మిది నెలలు నీటి నిర్వహణలో కీలకమని పేర్కొన్నారు. నిజాంసాగర్ ఆయకట్టుతో పాటు చెరువుల్లో నీటి లభ్యతను బట్టి సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.

**ఉద్యాన పంటల సాగుపై దృష్టి.**

యాసంగిలో నీటి లభ్యతను బట్టి వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి జొన్న, మొక్కజొన్న, శనగ, కంది, వేరుశనగ వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడటం, పంట మార్పిడి పాటించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చన్నారు. ఇంకుడు గుంతలు, నీటి నిల్వ నిర్మాణాలతో వర్షపు నీటిని ఒడిసిపట్టాలని కోరారు. భూమి, నీటి పరిస్థితులకు అనుగుణంగా ఉద్యాన పంటల సాగును పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అమరుల త్యాగం మరువలేం.. వారి కుటుంబాలకు అండగా ఉంటాం!

**పోలీస్ అమరవీరుల కుటుంబాలను పరామర్శించిన సీపీ సాయి చైతన్య**

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 22 (మనం న్యూస్): పోలీస్ విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను ఎప్పటికీ మరువలేమని, వారి కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఐపీఎస్ భరోసా ఇచ్చారు.

తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గురువారం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అమరులైన పోలీసుల కుటుంబ సభ్యులను సీపీ వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రభుత్వం నుంచి అందుతున్న సహాయ సహకారాలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏవైనా



సమస్యలు ఉన్నా, ప్రభుత్వపరంగా అదనపు సహాయం అవసరమైనా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అమరుల కుటుంబాల సంక్షేమాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు.



అమరుల కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటామని, వారి సమస్యల పరిష్కారానికి తన దృష్టికి తీసుకురావాలని సీపీ కోరారు.

ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఏసీపీ బి. ప్రకాష్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ మల్లేష్, రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ శ్రీధర్ రెడ్డి, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రపాటి శ్రీను, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## బిక్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

**గర్భిణులకు హెచ్ఐవీ, సిఫిలిస్ పరీక్షల నిర్వహణపై సమీక్ష**

బిక్నూర్, అక్టోబర్ 22 ( మనం న్యూస్ ): కామారెడ్డి జిల్లా బిక్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సమాచార విభాగం సంప్రదింపుల నిపుణుడు రాజీవ్ రంజన్ తివారి, తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహాయ ప్రాజెక్టు సంచాలకుడు డాక్టర్ రాజేశం ఆధ్వర్యంలోని బృందం గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసింది.

ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు హెచ్ఐవీ, సిఫిలిస్ పరీక్షలు ఏ విధంగా నిర్వహిస్తున్నారనే అంశాన్ని బృందం పరిశీలించింది. పరీక్షల్లో వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఎలాంటి చికిత్స అందిస్తున్నారు అవసరమైన సందర్భాల్లో సంబంధిత చికిత్సా కేంద్రాలకు ఏ విధంగా పంపిస్తున్నారు అనే వివరాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకుంది.

అనంతరం పరీక్షలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, వ్యాధి నిర్ధారణ అయిన వారికి సకాలంలో చికిత్స అందించడం, అవసరమైన వైద్య సేవల కోసం సంబంధిత కేంద్రాలకు పంపించడం వంటి అంశాలపై సమీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి పలు సూచనలు చేసింది. గర్భిణీ స్త్రీలకు అవసరమైన పరీక్షలు సకాలంలో నిర్వహించి, వ్యాధులు ఉన్నట్లు నిర్ధారణ అయిన





వారికి తగిన చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని బృందం సూచించింది. ఈ కార్యక్రమంలో బిక్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ వనశ్రీ, ఇతర వైద్య సిబ్బంది, తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రతినిధులు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి సిబ్బంది పాల్గొన్నారు.

## పండుగ సాయన్న జీవితం భావితరాలకు ఆదర్శం

సదాశివనగర్, అక్టోబర్ 22 (మనం న్యూస్): పెత్తందారులు,భూస్వాములు,జమీందారీ వ్యవస్థతో పాటు నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన తెలంగాణ ప్రజా వీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ సదాశివనగర్ మండల ముదిరాజ్ సంఘ ప్రతినిధులు అన్నారు.మండల కేంద్రంలో సాయన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు




అర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రజల అణచివేతను ఎదిరించి పోరాడిన ప్రజా వీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ అని తెలిపారు.సమాజంలో అసమానతలు తొలగి అందరికీ సమాన అవకాశాలు,గౌరవం లభించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.ప్రజల కోసం పోరాడిన మహనీయుల చరిత్రను భావితరాలకు తెలియజేయాలని,వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని యువత సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని సూచించారు.

## నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్లో

# ఘనంగా పండగ సాయన్న జయంతి వేడుకలు

**అణగారిన వర్గాల అభ్యున్నతికి పండుగ సాయన్న జీవితం స్ఫూర్తిదాయకం: అదనపు డీసీపీ శుభం ప్రకాష్**




నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 22 (మనం న్యూస్): నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఆదేశాల మేరకు గురువారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పండుగ సాయన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పండుగ సాయన్న సేవలను, ఆయన పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా అదనపు డీసీపీ శుభం ప్రకాష్ మాట్లాడుతూ.. నిరంకుశ నిజాం పాలనలో దేశ్ముఖ్లు, దొరలు, భూస్వాముల అణచివేతతో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో పండుగ సాయన్న ప్రజల పక్షాన నిలిచిన ధైర్యవంతుడైన నాయకుడని కొనియాడారు. ఎక్కడ అన్యాయం జరిగినా ఎదిరించే తెగువ ఆయన సొంతమని, అణగారిన ప్రజల ఆకలి తీర్చి, పేదల పట్ల ప్రేమను చాటడమే ఆయన చేసిన గొప్ప సామాజిక విప్లవమని పేర్కొన్నారు.

పండుగ సాయన్న వీరత్వాన్ని, పేదల పట్ల ఆయన చూపిన ప్రేమను నాటి జానపద కళాకారులు 12 మెట్ల కిన్నెర ద్వారా గానం చేస్తూ నేటి తరాలకు అందిస్తున్నారని తెలిపారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమాజంలో సమానత్వం సాధనకు, అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏఓ ఆసియా బేగం, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ మల్లేష్, ఆఫీస్ సూపరింటెండెంట్లు శంకర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ ధరణి, పోలీస్ కమిషనరేట్ కార్యాలయ సిబ్బందితో పాటు సీసీఆర్బీ, సీసీఎస్, ఐటీ కోర్, పోలీస్ కంట్రోల్ రూమ్, సెంట్రల్ కంప్లైంట్ సెల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

---

# వెట్టిచాకిరీ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అవగాహన కల్పించాలి

**- బాధితులకు ఉచిత న్యాయ సహాయం, డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టి. నాగరాణి.**

**వెట్టిచాకిరీ ఫిర్యాదులకు టోల్ఫ్రీ నంబరు 080-69434343.**



కామారెడ్డి, అక్టోబరు 22 (మనం న్యూస్): వెట్టిచాకిరీ, బాల కార్మిక వ్యవస్థ వంటి సామాజిక దురాచారాల నిర్మూలనకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టి. నాగరాణి సూచించారు. కామారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ), కార్మిక శాఖ, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ (ఐజేఎం) స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో న్యాయ అవగాహన శిబిరం నిర్వహించారు.

**కార్మికుల హక్కుల పరిరక్షణకు శాఖల సమన్వయం అవసరం**

ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ అప్పులు, ముందస్తు చెల్లింపులు, ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకుని కార్మికులతో బలవంతంగా పనిచేయించడం చట్టవిరుద్ధమని తెలిపారు. వెట్టిచాకిరీ వ్యక్తుల స్వేచ్ఛ, గౌరవం, ప్రాథమిక హక్కులను హరిస్తుందని పేర్కొన్నారు. బాధితులను గుర్తించి రక్షించడంతోపాటు వారికి న్యాయ సహాయం, పునరావాసం కల్పించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**పిల్లలను చట్టం నిషేధించిన పనుల్లో నియమించుకుండా చూడాలి**

బాల కార్మిక వ్యవస్థ పిల్లల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ప్రతి బాలుడికి, బాలికకు విద్యను అభ్యసించే హక్కు ఉందని, పిల్లలను చట్టం నిషేధించిన పనుల్లో నియమించుకుండా చూడాలని కోరారు. వెట్టిచాకిరీ బాధితులు, బాల కార్మికులు కనిపిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

**పోస్టర్ ఆవిష్కరణ.. ప్రతిజ్ఞ**

కార్యక్రమంలో భాగంగా పోస్టర్లు ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణ, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ మాయ సురేష్, సీనియర్ న్యాయవాదులు ఎం. వెంకట్ రామ్ రెడ్డి, నంద రమేష్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ ఎం. శ్రీనివాసరావు, అసిస్టెంట్ కౌన్సెల్ పి. విట్టల్ రావు తదితరులు చట్టాలు, ఫిర్యాదుల నమోదు విధానం, న్యాయ సహాయ సేవలపై వివరించారు. వెట్టిచాకిరీ ఫిర్యాదులకు 080-69434343 టోల్ఫ్రీ నంబరును సంప్రదించాలని, అర్హులకు డీఎల్ఎస్ఏ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుతుందని తెలిపారు.




---

# అమర పోలీసు కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగ భరోసా

**కానిస్టేబుల్ ఎంపల్లి ప్రమోద్ కుమార్ కుటుంబ సభ్యులకు నియామక ఉత్తర్వుల కాపీ అందజేసిన సీపీ సాయి చైతన్య**

**అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం, పోలీస్ శాఖ కట్టుబాటు**

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 22 (మనం న్యూస్): దేశ, ప్రజల భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల కుటుంబాలను ఆదుకోవడంలో తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య పేర్కొన్నారు. 2025లో విధి నిర్వహణలో అమరుడైన పోలీస్ కానిస్టేబుల్ ఎంపల్లి ప్రమోద్ కుమార్ (పీసీ నంబర్ 1923) కుటుంబానికి ప్రభుత్వం కల్పించిన ఉద్యోగానికి సంబంధించిన నియామక ఉత్తర్వుల కాపీని గురువారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కుటుంబ సభ్యులకు ఆయన అందజేశారు.

**అమరుడి కుటుంబానికి ప్రభుత్వ అండ**

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమరుల కుటుంబాలను ఆదుకునే చర్యల్లో భాగంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రమోద్ కుమార్ కుటుంబ సభ్యురాలు ప్రణీతకు ప్రభుత్వ ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ క్రమంలో భాగంగా గురువారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నియామక ఉత్తర్వుల కాపీని కుటుంబ సభ్యులకు సీపీ అందించారు.



**అమరుల త్యాగాలు చిరస్మరణీయం**

ఈ సందర్భంగా అమరుడైన ప్రమోద్ కుమార్ పోలీస్ శాఖకు అందించిన సేవలను సీపీ స్మరించుకున్నారు. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల రక్షణ కోసం పనిచేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ చిరస్మరణీయమని పేర్కొన్నారు. అమరుల కుటుంబాలకు ప్రభుత్వం, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటాయని, వారి సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.

ప్రజల భద్రత కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల సేవలను గౌరవించడం, వారి కుటుంబాలకు అండగా నిలవడం ప్రభుత్వంతో పాటు పోలీస్ శాఖ బాధ్యత అని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

---

# బీబీపేటలో పండగ సాయన్న జయంతి వేడుకలు

బీబీపేట, అక్టోబర్ 22(మనం న్యూస్): బీబీపేట మండల కేంద్రంలో బలహీన వర్గాల ఆశాజ్యోతి, ముదిరాజ్ ముద్దుబిడ్డ పండగ సాయన్న జయంతి వేడుకలు ముదిరాజ్ కులస్తులు ఘనంగా నిర్వహించారు. జయంతి పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి పాలాభిషేకం చేసి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూస్వాముల, పెత్తందారుల ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడి, విద్య ద్వారా ప్రజలలో చైతన్యం కలిగించి, వారి అభివృద్ధికి పాటుపడిన గొప్ప వీరుడిని ఆయన సేవలను కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పండగ సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నామని ముదిరాజ్ కులస్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# 88 ఏళ్ల వృద్ధురాలిపై దాడి.. దోపిడీ నిందితుడి అరెస్ట్

- డీఎస్పీ మధుసూదన్ పర్యవేక్షణలో సాంకేతిక ఆధారాలతో కేసును ఛేదించిన మాచారెడ్డి పోలీసులు.
- కామారెడ్డి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీధర్, మాచారెడ్డి ఎస్ఐ కె. విజయ్ ఆధ్వర్యంలో దర్యాప్తు.
- వెండి కడియాలు, బంగారు ముక్కుపుడక, నగదు దోపిడీ, నాలుగు వెండి కడియాలు స్వాధీనం.



కామారెడ్డి, అక్టోబరు 22 (మనం న్యూస్): కామారెడ్డి నియోజకవర్గం మాచారెడ్డిలో 88 ఏళ్ల వృద్ధురాలిని నమ్మించి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి, బెదిరించి దాడి చేసి ఆభరణాలు, నగదు దోపిడీ చేసిన నిందితుడిని మాచారెడ్డి పోలీసులు అరెస్టు చేశారు. సీసీ కెమెరాల దృశ్యాలు, సాంకేతిక ఆధారాల సహాయంతో కేసును ఛేదించారు. పోలీసుల వివరాల ప్రకారం.. గజ్జనాయక్ తండాకు చెందిన ఆగుళ్ల ఈరమ్మ ఈ నెల 21న మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో మాచారెడ్డి చౌరస్తాలోని కల్లు దుకాణం వద్ద నుంచి ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తి చెట్టు కొమ్మ చూపిస్తానని నమ్మించి ఆమెను ఆటోలో ఎక్కించుకున్నాడు. చుక్కాపూర్ గ్రామ శివారులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బెదిరించి, చేతులతో కొట్టి ఆమె వద్ద ఉన్న వెండి కడియాలు, ఒక గ్రాము బంగారు ముక్కుపుడకతోపాటు సంచిలోని నగదును లాక్కొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.



### పోలీసు సిబ్బందిని అభినందించిన ఎస్పీ

జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు డీఎస్పీ మధుసూదన్ పర్యవేక్షణలో, కామారెడ్డి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీధర్, మాచారెడ్డి ఎస్ఐ కె. విజయ్ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టాయి. సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించి నిందితుడిని గుర్తించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేటకు చెందిన ఆలకుంట అలియాస్ దండుగుల సాయిలు (34)ను గురువారం అదుపులోకి తీసుకున్నారు. వ్యక్తిగత ఖర్చులకు డబ్బులు సరిపోక సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దోపిడీకి పాల్పడినట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. అతడి నుంచి నాలుగు వెండి కడియాలను స్వాధీనం చేసుకున్నారు. కేసును త్వరితగతిన ఛేదించిన ఎస్ఐ విజయ్, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. వృద్ధులు, ఒంటరిగా సంచరించే వ్యక్తులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజల భద్రతకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.



## జమ్మి బంగారంతో ఎమ్మెల్యే భూపతి రెడ్డికి దసరా శుభాకాంక్షలు

**విజయదశమి వేళ ఆత్మీయంగా జమ్మి అందజేసిన నాయకులు**

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 22 (మనం న్యూస్): విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డిని పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంప్రదాయానికి ప్రతీకగా జమ్మి ఆకులను అందజేసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండుగలో జమ్మి ఆకులను బంగారంగా భావించి ఒకరికొకరు అందజేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకోవడం తెలంగాణ సంప్రదాయంలో ప్రత్యేకత. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే భూపతి రెడ్డిని కలిసిన నాయకులు పండుగ శుభాకాంక్షలు తెలియజేసి, ప్రజలందరికీ విజయదశమి సుఖసంతోషాలను అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ అందాన్, డీసీసీ కార్యదర్శి పారిపెల్లి గంగారెడ్డి, సాయిరెడ్డి, సీనియర్ నాయకుడు దేగం సాయన్న, సలీం తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డిలో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు

- ఐడీఓసీలో పండుగ సాయన్న చిత్రపటానికి నివాళులు.
- సామాజిక సమానత్వం, ఆత్మగౌరవంపై నేతల ఉద్ఘాటన.
- పాల్గొన్న అదనపు కలెక్టర్ విక్టర్, మున్సిపల్ చైర్పర్సన్, ప్రజాప్రతినిధులు.



కామారెడ్డి, అక్టోబర్ 22 (మనం బ్యూరో): తెలంగాణలో ధైర్యసాహసాలకు, ప్రజా పోరాటాలకు ప్రతీకగా నిలిచిన పండుగ సాయన్న జయంతి వేడుకలను గురువారం కామారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ విక్టర్ (రెవెన్యూ) ముఖ్య అతిథిగా హాజరుకాగా, మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి, అనంతరం పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన జీవితం, ధైర్యసాహసాలు, ప్రజల కోసం చేసిన పోరాటాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. పండుగ సాయన్న చరిత్రను భావితరాలకు తెలియజేయడంతోపాటు సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం, సామాజిక చైతన్యాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు.

### పాల్గొన్న ప్రముఖులు.

జిల్లా బీసీ అభివృద్ధి అధికారి నర్సయ్య, సహాయ బీసీ అభివృద్ధి అధికారి మామిండ్ల చక్రధర్, గ్రంథాలయ మాజీ చైర్మన్ పున్న రాజేశ్వర్ ముదిరాజ్, మాజీ జడ్పీటీసీ నంద రమేష్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు గజ్జల భిక్షపతి ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు కల్ల గంగారాజం ముదిరాజ్, కౌన్సిలర్లు కల్ల గణేష్ ముదిరాజ్, భాను ప్రసాద్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు బట్టు విఠల్ ముదిరాజ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు, బహుజన సంఘం నాయకులు కొత్తపల్లి మల్లయ్య, ఒడ్డెర ఎల్లయ్య, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. నరేష్, పవన్, సునీత, స్వామి, శాంతిష్ సహ పలువురు హాజరయ్యారు.






## హెచ్ఐవీ నియంత్రణలో కామారెడ్డిని మోడల్ జిల్లాగా తీర్చిదిద్దాలి: నాకో

- గర్భిణులకు హెచ్ఐవీ, సిఫిలిస్, హెచ్సీవీ పరీక్షలపై సమీక్ష.
- సురక్షిత ప్లస్ కార్యక్రమంలో జిల్లా భాగస్వామ్యం, నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (నాకో) కన్సల్టెంట్ రాజీవ్ రంజన్ తివారీ.
- వైద్య సిబ్బంది కృషిని అభినందించిన నాకో, టీజీ శాక్స్ ప్రతినిధులు.

కామారెడ్డి, అక్టోబరు 22 (మనం న్యూస్): హెచ్ఐవీ నియంత్రణలో కామారెడ్డి జిల్లాను మోడల్గా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (నాకో) కన్సల్టెంట్ రాజీవ్ రంజన్ తివారీ సూచించారు. గురువారం జిల్లాలో పర్యటించిన నాకో, తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (టీజీ శాక్స్) ప్రతినిధుల బృందం హెచ్ఐవీ నియంత్రణ కార్యక్రమాల అమలును పరిశీలించింది. ప్రతి గర్భిణికి హెచ్ఐవీ, సిఫిలిస్, హెచ్సీవీ పరీక్షలు నిర్వహిస్తున్న తీరును బృందం సమీక్షించింది. పరీక్షల్లో పాజిటివ్గా తేలిన వారికి అందిస్తున్న వైద్య సేవలు, అవసరమైనప్పుడు ఏఆర్టీ కేంద్రాలకు రిఫర్ చేసే విధానం, సంబంధిత రికార్డులను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేసింది.

### ఆరోగ్య సిబ్బంది కృషికి ప్రశంస

ఈ సందర్భంగా రాజీవ్ రంజన్ తివారీ మాట్లాడుతూ., సురక్షిత ప్లస్ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు. హెచ్ఐవీ నియంత్రణలో పనిచేస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది కృషిని ప్రశంసించారు. జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. టీజీ శాక్స్ ఏపీడీ డాక్టర్ రాజేశం మాట్లాడుతూ., ఎయిడ్స్ నియంత్రణలో జిల్లా సిబ్బంది చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం జిల్లా ప్రగతి నివేదికను కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్కు సమర్పించి చర్చించారు. జిల్లాలో హెచ్ఐవీ నియంత్రణకు అందరినీ భాగస్వాములను చేయాలని కలెక్టర్ సూచించారు.

### వైద్య ఆరోగ్యశాఖ నివేదికపై సంతృప్తి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట్ నివేదికపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీజీ శాక్స్ జాయింట్ డైరెక్టర్లు, టిఐ. ప్రసాద్, సీటీఎస్ డిప్యూటీ డైరెక్టర్ నరేష్, ప్రోగ్రాం అధికారి ప్రదీప్, డీపీఎం సుధాకర్, సీఏస్వో నవీన్, ఏఆర్టీ వైద్యులు డాక్టర్ స్నేహ, డాక్టర్ ఆంచల్ శ్రీవాస్తవ, కౌన్సిలర్లు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సిబ్బంది పాల్గొన్నారు.

# కలిగోట్లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు







## మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన ఎమ్మెల్యే భూపతి రెడ్డి దంపతులు

నిజాంబాద్ రూరల్, అక్టోబర్ 22 (మనం న్యూస్): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు జక్రాన్పల్లి మండలం కలిగోట్ గ్రామంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రాజు నాయక్ నేతృత్వంలో జరిగిన ఈ వేడుకలకు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి తన సతీమణి వినోదినితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే దంపతులకు గ్రామస్తులు, మహిళలు డప్పు వాయిద్యాలు, పూలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గజమాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. మహిళల కోలాహలం, సంప్రదాయ పాటలు, డప్పు చప్పుళ్లతో గ్రామంలో పండుగ సందడి నెలకొంది.

ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను ఒకచోట చేర్చి సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. బతుకమ్మల చుట్టూ వలయాకారంగా చేరి పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు. ఎమ్మెల్యే భూపతి రెడ్డి దంపతులు సైతం మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ ప్రతీక

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల గొప్ప సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. ప్రకృతిని, పూలను పూజిస్తూ మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ప్రత్యేకతను ప్రపంచానికి చాటిచెబుతుందని పేర్కొన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఇలాంటి సంప్రదాయాలను పరిరక్షించి, భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులు మహిళలను ఆప్యాయంగా పలకరించి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వారితో కలిసి గ్రామస్తులు సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు, గ్రామస్తులు పాల్గొనడంతో కలిగోట్లో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సాయరెడ్డి, మునిపల్లి సాయిరెడ్డి, రాజన్న, సంజయ్ రెడ్డి, ఉమ్మాజి నరేష్, వినోద్, హన్మండ్లు, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వరి కోతల వేళ చిరుత భయం..

## అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ సూచన

**వెంకంపల్లిలో చిరుత కలకలం.. భయాందోళనలో గ్రామస్తులు**

**పొలాలకు వెళ్లేందుకు జంకుతున్న రైతులు - అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారుల సూచన**



నాగిరెడ్డిపేట అక్టోబర్ 22 ( మనం న్యూస్): నాగిరెడ్డిపేట మండలం వెంకంపల్లి గ్రామంలో చిరుతపులి సంచారం కలకలం రేపింది. గురువారం సాయంత్రం గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న మంచినీటి ట్యాంకు వెనుక గుట్టపై చిరుతపులి కనిపించడంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

గుట్టపై చిరుతను గమనించిన స్థానికులు కేకలు వేయడంతో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. వారి అరుపులు, అలికిడితో చిరుత గుట్టపై నుంచి కిందకు దిగింది. ఈ క్రమంలో కొందరు యువకులు కేకలు వేస్తూ దానిని తరిమేందుకు ప్రయత్నించగా, చిరుత సమీపంలోని అటవీ ప్రాంతం వైపు వెళ్లిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు.

### గతంలోనూ కనిపించిందని ఆందోళన

సుమారు నెల రోజుల క్రితం కూడా గ్రామ పరిసరాల్లో చిరుత సంచరించినట్లు స్థానికులు గుర్తుచేస్తున్నారు. అయితే అప్పట్లో అది చిరుత కాదని అటవీశాఖ అధికారులు పేర్కొన్నట్లు గ్రామస్తులు తెలిపారు. తాజాగా మరోసారి చిరుత కనిపించడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది.

చిరుత సంచరించిన ప్రాంతం పరిసరాల్లో వెంకంపల్లి, తాండూర్, లింగంపల్లి గ్రామాలకు చెందిన రైతుల వ్యవసాయ భూములు ఉన్నాయి. ప్రస్తుతం వరి కోతల సీజన్ కావడంతో రైతులు, వ్యవసాయ కూలీలు పొలాలకు వెళ్లేందుకు భయపడుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి చిరుత సంచారంపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### రైతులు ఒంటరిగా వెళ్లొద్దు: అటవీశాఖ అధికారి

ఈ ఘటనపై నాగిరెడ్డిపేట అటవీశాఖ రేంజ్ అధికారి వాసుదేవ్ మాట్లాడుతూ.. గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం 7 గంటల వరకు రైతులు, వ్యవసాయ కూలీలు ఒంటరిగా పొలాల వద్దకు వెళ్లవద్దని సూచించారు. ఎవరికైనా చిరుతపులి కనిపిస్తే దాని దగ్గరకు వెళ్లడం, తరిమేందుకు ప్రయత్నించడం చేయకుండా వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.




# వృద్ధురాలిపై దాడి చేసి దోపిడీ.. నిందితుడి అరెస్ట్..

**- బాన్సువాడ డీఎస్పీ విట్టల్ రెడ్డి పర్యవేక్షణలో బిచ్కుంద సీఐ రవికుమార్, పెద్దకొడపగల్ ఎస్ఐ జి. అరుణ్ కుమార్ దర్యాప్తు.**

**- అంజనీలో ఒంటరిగా ఉంటున్న 60 ఏళ్ల వృద్ధురాలే లక్ష్యంగా దోపిడీ.**

**- అంజనీ గేటు వద్ద నిందితుడిని పట్టుకున్న పెద్దకొడపగల్ పోలీసులు, మోటార్ సైకిల్ స్వాధీనం**

కామారెడ్డి, అక్టోబరు 22 (మనం బ్యూరో): ఒంటరిగా నివసిస్తున్న వృద్ధురాలి ఇంట్లోకి చొరబడి ఆమెపై దాడి చేసి దోపిడీకి పాల్పడిన కేసులో నిందితుడిని పెద్దకొడపగల్ పోలీసులు అరెస్టు చేశారు. సీసీ కెమెరాల దృశ్యాలు, స్థానిక సమాచారం, సాంకేతిక ఆధారాలతో కేసును ఛేదించారు. నిందితుడి నుంచి మోటార్ సైకిల్ను స్వాధీనం చేసుకున్నారు.

### పోలీసుల వివరాలు..

పోలీసుల వివరాల ప్రకారం.. పెద్దకొడపగల్ మండలం అంజనీ గ్రామానికి చెందిన బేగరి బాలవ్వ (60) ఇంట్లోకి సెప్టెంబరు 30న రాత్రి 10.30 గంటల సమయంలో ఎగ్గడి నవీన్ కుమార్ (27) చొరబడ్డాడు. ఇంట్లోని విద్యుత్ బల్బును తొలగించి, వృద్ధురాలి నోరు మూసి ఆమె మెడలోని పసుపు తాడును బంగారు గొలుసుగా భావించి కత్తెరతో కత్తిరించాడు. వృద్ధురాలు ధైర్యంగా ప్రతిఘటించి నిందితుడి చేతిని కొరకడంతోపాటు అతని చేతిలోని కత్తెరను లాక్కుంది. దీంతో నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు.

### సీసీ కెమెరాలు, టీషర్టు ఆధారంగా నిందితుడి గుర్తింపు

బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు పారిపోయే క్రమంలో అతని టీషర్టు ఇంటి సమీపంలోని ఇనుప కంచెకు చిక్కి అక్కడే ఉండిపోయింది. ఈ ఆధారంతోపాటు సీసీ కెమెరాల దృశ్యాలు, స్థానికంగా సేకరించిన సమాచారాన్ని విశ్లేషించి నిందితుడిని గుర్తించారు. గురువారం అంజనీ గేటు వద్ద ఎగ్గడి నవీన్ కుమార్ను అదుపులోకి తీసుకున్నారు.

### ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో దోపిడీ.

కంచుమహల్ గ్రామానికి చెందిన నవీన్ హైదరాబాద్లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో తన పెద్దమ్మ బాలవ్వ ఇంట్లో దోపిడీకి పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

### కేసును ఛేదించిన పోలీసులను అభినందించిన ఎస్పీ

జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు, బాన్సువాడ డీఎస్పీ విట్టల్ రెడ్డి పర్యవేక్షణలో బిచ్కుంద సీఐ రవికుమార్, పెద్దకొడపగల్ ఎస్ఐ జి. అరుణ్ కుమార్, సిబ్బంది దర్యాప్తు చేపట్టారు. కేసును ఛేదించిన పోలీసులను ఎస్పీ అభినందించారు. ఒంటరిగా నివసించే వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ ప్రతి నీటి బొట్టును సంరక్షించాలి

**: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**






సదాశివనగర్, అక్టోబర్ 22(మనం న్యూస్): ఎల్నినో ప్రభావంతో వర్షపాతం తగ్గుతున్న నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో పంటల సాగు చేపట్టాలని,నీటి లభ్యతకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు.గురువారం సదాశివనగర్ మండలం ధర్మారావుపేట గ్రామంలోని రైతు వేదికలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిర్వహించిన వీడియో సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పాల్గొన్నారు.వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలు,పత్తి మార్కెటింగ్,కనీస మద్దతు ధరలపై రైతులకు అవగాహన కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి పలు సూచనలు చేశారు.ప్రభుత్వ మార్గదర్శకాలు, మార్కెటింగ్ విధానాలు, మద్దతు ధరలకు సంబంధించిన సమాచారాన్ని రైతులకు చేరవేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమం,ఖేత్ బచావో అభియాన్లో భాగంగా రైతులతో మాట్లాడిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...రాష్ట్రంతో పాటు కామారెడ్డి జిల్లాలోనూ వర్షపాతం తక్కువగా నమోదవుతోందని తెలిపారు.గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో భూగర్భ జలమట్టం సుమారు నాలుగు నుంచి ఐదు మీటర్ల మేర తగ్గిందని పేర్కొన్నారు.సదాశివనగర్,పెద్దకొడప్గల్,మహమ్మద్నగర్ తదితర మండలాల్లో వర్షపాతం లోటు కారణంగా పొడి వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు.రాబోయే ఎనిమిది నుంచి తొమ్మిది నెలలు నీటి నిర్వహణ పరంగా అత్యంత కీలకమని,నిజాంసాగర్ ఆయకట్టుతో పాటు చిన్న చెరువులు,ఇతర నీటి వనరుల్లో నీటి లభ్యతను అంచనా వేసి రైతులు పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

**ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యం**

రాబోయే యాసంగి సీజన్లో నీటి లభ్యతను బట్టి వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి, జొన్న,మొక్కజొన్న,శనగ,కంది,వేరుశనగ వంటి ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు.నీటి లభ్యతను అంచనా వేయకుండా అధిక నీటి అవసరమయ్యే పంటలను సాగు చేస్తే రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.భూమి స్వభావం,నేల పరిస్థితులు,నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు.

**నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి**

ప్రతి ఇంటి వద్ద,ప్రతి గ్రామంలో వర్షపు నీటిని ఒడిసిపట్టే చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.ఇంకుడు గుంతలు,వ్యవసాయ క్షేత్రాల్లో నీటి నిల్వ గుంతలు, భూగర్భ జలాల పునరుద్ధరణ నిర్మాణాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.వర్షపు నీరు వృథా కాకుండా సంరక్షించడం ద్వారా భూగర్భ జలమట్టాన్ని పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు.రైతులు నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ,రాబోయే కాలానికి తగిన విధంగా నీటి నిర్వహణ చేపట్టాలని కోరారు.

**నేల ఆరోగ్య పరిరక్షణతో సాగు ఖర్చులు తగ్గించాలి**

ఖేత్ బచావో అభియాన్లో భాగంగా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం,భూసారాన్ని పునరుద్ధరించడం,రసాయన ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగాన్ని తగ్గించడంపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించడం,పంట మార్పిడి విధానాన్ని పాటించడం,పంట వ్యర్థాలను సక్రమంగా నిర్వహించడం వంటి శాస్త్రీయ పద్ధతులను ప్రోత్సహించాలని తెలిపారు.ప్రకృతి వ్యవసాయం,సేంద్రియ వ్యవసాయ పద్ధతులను క్రమంగా అవలంబించడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించి,నేల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని పేర్కొన్నారు.

**ఉద్యాన పంటలతో అదనపు ఆదాయం**

రైతులు తమ భూమి స్వభావం,నీటి లభ్యతకు అనుగుణంగా ఆయిల్పామ్,కూరగాయలు తదితర ఉద్యాన పంటల సాగును పరిశీలించాలని కలెక్టర్ సూచించారు.ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు, ఆదాయాన్ని పెంచుకునేందుకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు.ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని,పంటల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని,ప్రతి నీటి బొట్టును సమర్థంగా వినియోగించుకుంటూ నీటి సంరక్షణ చర్యల్లో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి,సర్పంచ్ ఉమర్,వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి,ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి,తహసీల్దార్ సత్యనారాయణ మార్కెటింగ్ అధికారి రమ్య,ఎంపీడీఓ సంతోష్ కుమార్,ఎంపీఓ సురేందర్,పంచాయతీ కార్యదర్శులు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వారం రోజులైనా పూడ్చని రహదారి గుంత!

**ప్రమాదం జరిగాకే స్పందిస్తారా?**

**మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై కాలనీవాసుల ఆగ్రహం**




ఆర్మూర్, అక్టోబర్ 22 (మనం న్యూస్): ఆర్మూర్ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి రహదారిపై ఏర్పడిన భారీ గుంత నిదర్శనంగా నిలుస్తోంది. డ్రైనేజీ మరమ్మతుల కోసం రహదారిపై గుంత తీసి వారం రోజులు గడుస్తున్నా, ఇంతవరకు మరమ్మతులు చేపట్టి గుంతను పూడ్చకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్మూర్ మీదుగా నిజామాబాద్కు నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇలాంటి రద్దీ రహదారిపై భారీ గుంత ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంత కనిపించక ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రమాదం జరిగే వరకు వేచి చూస్తారా?**

రహదారిపై గుంత తీసిన వెంటనే డ్రైనేజీ మరమ్మతులు పూర్తి చేసి రహదారిని యథాస్థితికి తీసుకురావాల్సిన అధికారులు వారం రోజులుగా పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించాలని కాలనీవాసులు కోరుతున్నారు.




ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించక ముందే రహదారిపై ఉన్న భారీ గుంతను వెంటనే పూడ్చి, డ్రైనేజీ మరమ్మతులు పూర్తి చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా నిర్లక్ష్యాన్ని వీడి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

# బిక్నూర్లో చర్మంపై మచ్చల గుర్తింపు కోసం ఇంటింటా సర్వే

**నవంబర్ 4వ తేదీ వరకు సర్వే నిర్వహణ - అనుమానితులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలి: వైద్యురాలు డాక్టర్ యమీమా**



బిక్నూర్, అక్టోబర్ 22 ( మనం న్యూస్ ): శరీరంపై మచ్చలు ఉన్నవారిని గుర్తించేందుకు బిక్నూర్ మండలంలోని ప్రతి గ్రామంలో ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తున్నారు. ఈ నెల 22వ తేదీ నుంచి నవంబర్ 4వ తేదీ వరకు ఈ సర్వే కొనసాగనుంది.

ఈ సందర్భంగా బిక్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ యమీమా సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటలలోపు సర్వే నిర్వహించి శరీరంపై అనుమానాస్పద మచ్చలు ఉన్నవారిని గుర్తించి తదుపరి వైద్య పరీక్షల కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలని ఆదేశించారు.



సర్వేలో భాగంగా ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటిని సందర్శించి ప్రజల ఆరోగ్య పరిస్థితులను పరిశీలిస్తున్నారు. అనుమానిత లక్షణాలు ఉన్నవారిని గుర్తించి వారికి అవసరమైన వైద్య పరీక్షలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

ప్రజలు ఈ సర్వేకు సహకరించి శరీరంపై అనుమానాస్పద మచ్చలు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని ఆరోగ్య సిబ్బంది సూచిస్తున్నారు.

డాక్టర్ యమీమా ఆదేశాల మేరకు బిక్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈ సర్వేను సిబ్బంది గురువారం విజయవంతంగా ప్రారంభించి కొనసాగించారు.

# నాణ్యతతో మొరం రోడ్డు పనులు-చైర్‌పర్సన్

**- 9వ వార్డులో పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్.**

**- ఎస్డీఆర్ఎఫ్ నిధులతో రోడ్డు నిర్మాణ పనులు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచన.**





కామారెడ్డి, అక్టోబరు 22 (మనం న్యూస్): కామారెడ్డి పట్టణ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించేందుకు చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ అధికారులకు సూచించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని 9వ వార్డులో ఎస్డీఆర్ఎఫ్ నిధులతో చేపడుతున్న మొరం రోడ్డు పనులను గురువారం ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు ఏ దశలో ఉన్నాయనే వివరాలను సేకరించి, నిర్మాణంలో ఎక్కడా నాణ్యత లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిబంధనలకు అనుగుణంగా పనులు చేపట్టాలని అధికారులతో పాటు కాంట్రాక్టర్కు స్పష్టం చేశారు.

**నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలి**

వార్డుల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమివ్వాలని చైర్పర్సన్ పేర్కొన్నారు. రహదారి పనుల వల్ల స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల అమలులో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, పనుల నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, స్థానిక కౌన్సిలర్ నరేందర్ రెడ్డి, డీఈ హన్మంతరావు, ఏఈ వేణుప్రసాద్, టీపీఓలు వినీత్, దేవరాజు, స్థానిక ప్రజలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# చిల్లర్గి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ప్రమాణ స్వీకారం

**- రైతు సంక్షేమమే లక్ష్యంగా సహకార రంగ అభివృద్ధికి కృషి చేయాలి.**

**- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ హాజరు.**





పిట్లం, అక్టోబర్ 22 (మనం న్యూస్): పిట్లం మండలంలోని చిల్లర్గి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన చైర్మన్గా ధర్మరెడ్డి గారి రాంరెడ్డి (న్యాయవాది) బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గురువారం పిట్లంలోని సాయి గార్డెన్లో నిర్వహించిన ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమానికి జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన చైర్మన్కు శుభాకాంక్షలు తెలియజేశారు.

**రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత**

ఈ సందర్భంగా వ్యవసాయ సహకార రంగాన్ని మరింత బలోపేతం చేస్తూ రైతులకు మెరుగైన సేవలు అందించడంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. రైతుల అవసరాలను గుర్తించి, వారి సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ వ్యవసాయ రంగ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలని నూతన చైర్మన్కు సూచించారు.



**సహకార రంగ అభివృద్ధికి సమష్టి కృషి.**

నూతన నాయకత్వంలో చిల్లర్గి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మరింత అభివృద్ధి సాధించి రైతులకు అవసరమైన సేవలను సమర్థవంతంగా అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతుల సమస్యల పరిష్కారానికి, సహకార వ్యవస్థ బలోపేతానికి పాలకవర్గ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు.

**నూతన చైర్మన్కు నాయకుల అభినందనలు.**



ఈ కార్యక్రమంలో జుక్కల్ నియోజకవర్గంలోని వివిధ మండలాల మార్కెట్ కమిటీల అధ్యక్షులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతన చైర్మన్ ధర్మరెడ్డి గారి రాంరెడ్డికి, పాలకవర్గ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. రైతు సంక్షేమమే లక్ష్యం.. సహకార రంగ అభివృద్ధే ధ్యేయం.. ప్రజాసేవే బాధ్యతగా నూతన పాలకవర్గం ముందుకు సాగాలని పలువురు ఆకాంక్షించారు.

# అమర పోలీసుల త్యాగాలకు ఘన నివాళి

**అమరవీరుల స్ఫూర్తిని చాటుతూ సెవెంత్ బెటాలియన్ బైక్ ర్యాలీ**

**కమాండెంట్ బి. సీతారాం ఆధ్వర్యంలో నిర్వహణ**






నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 22 (మనం న్యూస్): దేశ రక్షణలో, శాంతిభద్రతల పరిరక్షణలో విధులు నిర్వర్తిస్తూ ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ తెలంగాణ స్పెషల్ పోలీస్ సెవెంత్ బెటాలియన్ ఆధ్వర్యంలో గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ బి. సీతారాం ఆధ్వర్యంలో బెటాలియన్ నుంచి డిచ్పల్లి ఎస్బిఐ బ్యాంకు వరకు ఈ ర్యాలీ కొనసాగింది.

**అమరుల త్యాగాలు చిరస్మరణీయం**

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ ర్యాలీ ద్వారా దేశం కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ వీరుల సేవలను ప్రజలకు తెలియజేశారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల అంకితభావం, ధైర్యసాహసాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. వారి త్యాగాలను ఎప్పటికీ మరువకూడదని, వారు చూపిన మార్గంలో నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.





**అమరవీరుల స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యం**

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడం, దేశం కోసం ప్రాణాలర్పించిన వీరులకు ఘనంగా నివాళులర్పించడం ఈ బైక్ ర్యాలీ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ప్రజల భద్రత కోసం పోలీసు సిబ్బంది చేస్తున్న సేవలను గుర్తుచేస్తూ, అమరవీరుల త్యాగస్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ బి. సీతారాం, అసిస్టెంట్ కమాండెంట్ నరసింహస్వామి, ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# స్వేచ్ఛా రథం ప్రారంభించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**- వెట్టిచాకిరీ నిర్మూలనకు 'స్వేచ్ఛా రథం', కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం.**

**- కార్మికుల హక్కులపై విస్తృత అవగాహన, టోల్ఫ్రీ హెల్ప్లైన్ 080-69434343 వినియోగించుకోవాలి.**





కామారెడ్డి, అక్టోబర్ 22 (మనం బ్యూరో): వెట్టిచాకిరీ నిర్మూలనపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, వెట్టిచాకిరీ బాధితులకు అందించే సహాయం, పునరావాసంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన 'స్వేచ్ఛా రథం' ప్రచార వాహనాన్ని గురువారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు.

### బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ., వెట్టిచాకిరీ నిరోధక చట్టం అమల్లో ఉన్నప్పటికీ అక్కడక్కడ ఇటువంటి ఘటనలు వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు. బాధితులను గుర్తించి తక్షణమే రక్షించడంతోపాటు వారికి ప్రభుత్వ సహాయం, పునరావాసం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్మికులకు తమ హక్కులపై అవగాహన కల్పించి, వెట్టిచాకిరీ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### పని ప్రదేశాల్లో అవగాహన.

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించే స్వేచ్ఛా రథం ద్వారా అసంఘటిత కార్మికులు, వెట్టిచాకిరీకి గురయ్యే ప్రమాదం ఉన్న వర్గాలకు అవగాహన కల్పించనున్నారు. వ్యవసాయం, ఇటుక బట్టీలు, చేపలు, రొయ్యల పెంపకం, గనులు, క్వారీల్లో పనిచేసే కార్మికులకు వెట్టిచాకిరీ దుష్పరిణామాలు, ఫిర్యాదుల నమోదు విధానాలను వివరించనున్నారు. అప్పులు, ముందస్తు చెల్లింపులు, బలవంతపు ఒత్తిళ్లతో వెట్టిచాకిరీలో చిక్కుకున్నవారికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ సహాయ వ్యవస్థలను తెలియజేయనున్నారు.

### హెల్ప్లైన్ను వినియోగించుకోవాలి.

వెట్టిచాకిరీకి గురైనవారు లేదా అలాంటి ఘటనల గురించి తెలిసినవారు స్వేచ్ఛా రథం' ప్రారంభించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్080-69434343 టోల్ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. కరపత్రాల ద్వారా గ్రామీణ ప్రాంతాలు, పని ప్రదేశాల్లో ఈ నంబరుపై ప్రచారం చేయనున్నారు.

### అధికారులతో ప్రతిజ్ఞ.

కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ డాక్టర్ మున్నం శశికుమార్ అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దామోదర్, జిల్లా పంచాయతీ అధికారి మురళి, అంతర్జాతీయ న్యాయ సహాయ సంస్థ ప్రతినిధి ఆనంద్ కుమార్తోపాటు కార్మిక, పోలీసు, మానవ అక్రమ రవాణా నిరోధక, న్యాయ సేవలు, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పిట్లం ప్రభుత్వ ఆసుపత్రికి రిఫ్రిజిరేటర్ విరాళం

**- తండ్రి జ్ఞాపకార్థం అందజేసిన కొంతం రాజ్ కుమార్ గుప్తా (దుబాయ్ రాజు)**

**- దాతృత్వాన్ని అభినందించిన ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్.**



పిట్లం, అక్టోబర్ 22 (మనం న్యూస్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి కొంతం రాజ్ కుమార్ గుప్తా (దుబాయ్ రాజు) తన దివంగత తండ్రి జ్ఞాపకార్థం రిఫ్రిజిరేటర్ను విరాళంగా అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలకు ఉపయోగపడేలా ఈ విరాళాన్ని అందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

### దాతృత్వాన్ని అభినందించిన ప్రజాప్రతినిధులు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రికి రిఫ్రిజిరేటర్ను విరాళంగా అందించిన దాత రాజ్ కుమార్ గుప్తాను అభినందించారు.

### ప్రభుత్వ ఆసుపత్రులకు ప్రజల సహకారం కీలకం.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేయడంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని తెలిపారు. సమాజానికి ఉపయోగపడేలా చేపట్టే ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తినిస్తాయని అన్నారు.

### తండ్రి జ్ఞాపకార్థం సేవా కార్యక్రమం.

తన దివంగత తండ్రి జ్ఞాపకార్థం ప్రభుత్వ ఆసుపత్రికి రిఫ్రిజిరేటర్ను విరాళంగా అందజేసిన కొంతం రాజ్ కుమార్ గుప్తా (దుబాయ్ రాజు) సేవాభావాన్ని నాయకులు ప్రత్యేకంగా ప్రశంసించారు. వ్యక్తిగత జ్ఞాపకాన్ని ప్రజోపయోగ కార్యక్రమంగా మలచడం అభినందనీయమని పేర్కొన్నారు.

### పలువురు నాయకుల హాజరు.

ఈ కార్యక్రమంలో పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చికోటి మనోజ్ కుమార్, మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ఇతర నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.



# గ్రామ పంచాయతీ షట్టర్లు అర్హులైన వారికే కేటాయించాలి

**గ్రామ పంచాయతీ కార్యదర్శి సందీప్కు వినతిపత్రం అందజేసిన వ్యాపార సంఘం**

మద్నూర్ / అక్టోబర్ 22 ( మనం న్యూస్) : మద్నూర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న షట్టర్లను అర్హులైన వారికి కేటాయించి న్యాయం చేయాలని వ్యాపార సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ కార్యదర్శి సందీప్కు వినతిపత్రం అందజేసి, షట్టర్ల కేటాయింపులో పారదర్శకత పాటించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న షట్టర్లను కేటాయించే సమయంలో ఎలాంటి పక్షపాతానికి తావులేకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులను ఎంపిక చేయాలని సంఘం నాయకులు కోరారు. ఆర్థికంగా వెనుకబడినవారికి, స్వయం ఉపాధి ద్వారా కుటుంబాలను పోషించుకోవాలనుకునే, అర్హులైన వ్యాపారస్తులకు ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

పారదర్శకంగా కేటాయింపు ప్రక్రియలో అర్హత ప్రమాణాలను పరిగణనలోకి తీసుకోవాలని, కేటాయింపులకు సంబంధించిన నిబంధనలను స్పష్టంగా పాటించాలని వ్యాపార సంఘం నాయకులు సూచించారు. గ్రామ పంచాయతీకి చెందిన ఆస్తులు ప్రజల ప్రయోజనాలకు ఉపయోగపడేలా చూడాలని, అర్హులైన వారికి అన్యాయం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

షట్టర్ల ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు లభించేలా, వ్యాపార కార్యకలాపాలు అభివృద్ధి చెందేలా కేటాయింపులు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో వ్యాపార సంఘం ప్రధాన కార్యదర్శి రచ్చ కుశాల్ కుమార్, ఉపాధ్యక్షుడు ఉడుతవార్ సురేష్, కార్యదర్శి నాగనాథ్ గంపల్వార్, వ్యాపారస్తులు కొండేకర్ విఠల్, సుంకివార్ శ్రీధర్, మారుతి, అబ్బు, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.





# దుర్గామాత లడ్డూ వేలానికి భారీ స్పందన

**.రూ.54,101కు లడ్డూను దక్కించుకున్న కమ్మరి శ్రీశైలం**

నిజాంసాగర్,అక్టోబర్ 22 (మనం న్యూస్): బంజపల్లి గ్రామంలో జై దుర్గా భవానీ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గామాత లడ్డూ వేలం పాటకు భారీ స్పందన లభించింది. ఈ వేలం పాటలో బంజేపల్లి ఆడపడుచు తాండూర్కు చెందిన కమ్మరి సంధ్య శ్రీశైలం, రూ.54,101లకు లడ్డూను దక్కించుకున్నారు. అదేవిధంగా సేపు పండు వేలం పాటను కూడా నిర్వహించగా, నిజాంసాగర్కు చెందిన చాకలి మల్లేష్ రూ.17,551కు దక్కించుకున్నారు.భక్తుల ఉత్సాహం, అమ్మవారిపై ఉన్న అపారమైన భక్తిశ్రద్ధల మధ్య వేలం పాట ఉత్సాహభరితంగా సాగింది. దుర్గామాత ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని భక్తులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండలి సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ నగర్ గ్రామ పంచాయతీలో డీఎల్పీవో నాగరాజు పర్యటన

**పలు రికార్డుల పరిశీలన.. ఇంకుడు గుంతల పనులు చేపట్టాలని సూచన...**

రెంజల్, అక్టోబర్ 22 (మనం న్యూస్): మండలంలోని అంబేద్కర్ నగర్ గ్రామ పంచాయతీని గురువారం డీఎల్పీవో నాగరాజు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న వివిధ రికార్డులను పరిశీలించి, పంచాయతీ పరిపాలనకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై పరిశీలన జరిపారు.





**ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి.,**

ఈ సందర్భంగా గ్రామంలో ఇంకుడు గుంతల పనులను చేపట్టాలని డీఎల్పీవో నాగరాజు సూచించారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలాల పెంపునకు అవకాశం ఉంటుందని, నీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. గ్రామంలో నీటి సంరక్షణకు సంబంధించిన పనులను ప్రోత్సహిస్తూ, అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

**రికార్డుల నిర్వహణపై పరిశీలన.,**

గ్రామ పంచాయతీ కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించిన డీఎల్పీవో, పంచాయతీ పరిపాలనకు సంబంధించిన అంశాలను సమీక్షించారు. గ్రామ అభివృద్ధికి సంబంధించిన పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ పర్యటనలో గ్రామ సర్పంచ్ వాగ్మారె మాధవ్, రాము, దత్తు, మూసా భాయ్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు...

# ఘనంగా కొమురం భీం 125వ జయంతి వేడుకలు

**- ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన మహనీయుడి సేవలను స్మరించుకున్న నాయకులు.**

బాన్సువాడ, అక్టోబర్ 22 (మనం న్యూస్): బాన్సువాడ మండలంలోని హన్మాజీపేట్ గ్రామంలో ఆదివాసీ నాయకపోడు సంఘం ఆధ్వర్యంలో కొమురం భీమ్125 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురం భీమ్ చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన చేసిన పోరాటాలను, ఆదివాసీల హక్కుల సాధన కోసం ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు.

ఆదివాసీ సమాజ హక్కుల పరిరక్షణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన కొమురం భీమ్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. అడవి, భూమి, నీరు వంటి సహజ



వనరులపై ఆదివాసీలకు హక్కులు ఉండాలని ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని కొనియాడారు. ఆదివాసీల ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం ఆయన చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు.

కొమురం భీమ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ఆదివాసీ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణతో పాటు వారి సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు.

హన్మాజీపేట్ గ్రామంలో నిర్వహించిన ఈ జయంతి కార్యక్రమంలో ఆదివాసీ పోడు సంఘం సభ్యులు, పాల్గొని కొమురం భీమ్కు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్బంగా మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొంకి గణేష్ మాట్లాడుతూ., ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ఆదివాసీల ఐక్యత, అభ్యున్నతికి కృషి చేయాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ ఆశగోని లావణ్య, వార్డ్ సభ్యులు కొంకి సాయిలు. పోచయ్య వడ్ల భాగయ్య సంఘు సభ్యులు, పెంకటి గణేష్ గడిల శంకర సౌజీవులు, గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

# సెవెంత్ బెటాలియన్లో ఘనంగా పండగ సాయన్న జయంతి

**పండగ సాయన్న సేవలు చిరస్మరణీయం: కమాండెంట్ బి. సీతారాం**







నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 22 (మనం న్యూస్): ప్రముఖ ప్రజా నాయకుడు పండగ సాయన్న జయంతి వేడుకలను డిచ్పల్లిలోని తెలంగాణ స్పెషల్ పోలీస్ సెవెంత్ బెటాలియన్లో గురువారం ఘనంగా నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ బి. సీతారాం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పండగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కమాండెంట్ బి. సీతారాం మాట్లాడుతూ ప్రజల కోసం కృషి చేసిన పండగ సాయన్న జీవిత విశేషాలను, ఆయన సేవలను స్మరించుకున్నారు. సమాజంలో సమానత్వం, ధైర్యం, సేవాభావం వంటి విలువలు ప్రతి ఒక్కరిలో ఉండాలని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం పనిచేసిన మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు. పండగ సాయన్న జీవితం ప్రజలకు సేవ చేయాలనే స్ఫూర్తిని అందిస్తుందని, ఆయన సేవలను స్మరించుకోవడం ద్వారా సమాజంలో మంచి విలువలను పెంపొందించుకోవచ్చని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ నరసింహస్వామి, బెటాలియన్ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.